# వ్యాపారం

ఎందుకిలా మండిపడుతున్నావ్ నాన్నా"? ప్రకాశం అన్నాడు. "ఇంజనీరింగ్ చదివితేనే చదువా? నేను చదవలేను".

శంకర్రావ్ ఏమీ మాట్లాడలేదు. కొడుకు వైపు చూడలేదు. రోడ్డువైపు దృష్టి మళ్లించాడు.

వైశాఖం రాలేదు గానీ, ఎండలు మండిపోతున్నాయి. రోడ్డు నిర్మామష్యంగా ఉంది.

బిడ్డ చల్లగా నీడలో ఉండాలనే తపనతో చెట్టుకిందకు తీసికెళుతోంది ఓ ఆవు దాని దూడని. నీడలో ఉండే సుఖం ఏమిటో ఎరుగని దూడ ఎండలోకి దూకుతోంది.

శంకర్రావు మామూలు మనిషి, వారసత్వంగా వచ్చిన రెండెకరాల పొలం పండించుకొంటూ, ఓ చిన్న బడ్డీ కొట్టు పెట్టుకొని బ్రతికేవాడు. ఓ ఆరు నెలల క్రితమే చిన్న బట్టలకొట్టు ప్రారంభించాడు.

అబ్బాయి ఇంజనీరింగ్ చదవాలనీ మంచి వుద్యోగం చెయ్యాలనీ అతని కోరిక. అందువల్లే చిన్నప్పటి నుంచీ ప్రకాశాన్ని పట్నంలో ఇంగ్లీసు మీడియం స్కూల్లో చదివించాడు. ఇంజనీరింగ్‌లో సీటు రానప్పటికీ ఏభైవేల రూపాయలు అతి కష్టంమీద డొనేషన్ కట్టి సీటు కొన్నాడు కాని ఓ సంవత్సరం చదివి, ఇప్పుడు ఇంజనీరింగ్ చదవనంటున్నాడు.

"నాకు ఏమీ అర్థం కావట్లేదు నాన్నా" ప్రకాశం అన్నాడు. "నేను పాసవుతావునే నమ్మకం నాకు లేదు అందుకని...."

"అందుకని............."

"చదువు మానేసి ఏ వ్యాపారమైనా చేస్తాను".

"ఏమండోయ్. ఓసారిలా రండి". పెరట్లోంచి శంకర్రావ్ భార్య కేకేసింది. "పెరట్లో మామిడిచెట్ల కాయలన్నీ రాలిపోతున్నాయండి".

పెరట్లోని మామిడిచెట్టు శంకర్రావు స్వహస్తాలతో వేసినది. పూలుపూసి కాయలు వస్తుంటే చాలా ఆనందించేదు ముగ్గిపండుతాయని. గానీ ఏం లాభం. ముగ్గక ముందే నేలపాలవుతున్నాయి.

నిట్టూర్చాడు శంకర్రావ్.

"వ్యాపారమైతే నీకు అర్థం అవుతుందా?" మెల్లగా అడిగేడు శంకర్రావ్.

"ఎందుకర్థం కాదు? నీ దగ్గరే, నీ దుకాణంలోనే నేర్చుకుంటాను".

"అయితే విను, సామాన్లు కొని సొమ్ములిచ్చి జాగ్రత్తపరచమని ఒకరు కొట్లోవుంచి వెళ్లారనుకో జాగ్రత్తపరచాలా? వద్దా?"

"తప్పనిసరిగ జాగ్రత్తపరచాలి".

"ఇప్పుడు నా పరిస్థితి కూడా అంతే" శంకర్రావ్ ఓ నిమిషమాగి అన్నాడు.

"ఏభైవేల రూపాయలు డొనేషన్ కట్టిన రోజే నేను నిన్ను సొమ్ముచేసుకున్నాను. ఇంజనీరింగ్ పూర్తికాగానే నీకూ, ధర్మారావు కూతురికి పెళ్ళిచేస్తానని చెప్పి ధర్మారావు దగ్గర మూడు లక్షలు తీసుకున్నాను. నిన్ను ఇంజనీర్‌గా ధర్మారావుకి అప్పచెప్పటం నా వ్యాపారధర్మం. అర్థమయిందా నా బాధ?"

ప్రకాశం నోట మాట రాలేదు.

ఆంధ్రభూమి దినపత్రిక 14-12-1991